# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-07-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ప్లాస్టిక్ వ్యర్థాలతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఘన, ద్రవ వనరుల నిర్వహణను సమర్థంగా చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు.**

**2. అనంతపురంలో అనువైన భూమి చూపితే విమానాశ్రయం ఏర్పాటుపై అధ్యయనం ప్రారంభిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు.**

**3. లోకో పైలెట్‌లు, అసిస్టెంట్ లోకోపైలెట్‌లు, ట్రైన్ మేనేజర్లకు మౌలిక సదుపాయాలు, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర ఆనంద్‌రావు పాటిల్ తెలిపారు.**

**4. సైన్యంలో పనిచేసిన మాజీ అగ్నివీర్‌లకు కేంద్ర పారమిలిటరీ బలగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ ప్రకటించాయి.**

**5. భారతదేశ జనాభా 2060 నాటికి 170 కోట్లకు చేరుతుందని, ఆ తర్వాత 12 శాతం తగ్గుదల రేటుతో క్రమంగా తగ్గుతుందని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది.**

==========================

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను తిని ఆవులు మరణించడంపై ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఈరోజు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయానికి తొలిసారి వచ్చిన ఆయనకు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలో ఘన, ద్రవ వనరుల నిర్వహణపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పవన్‌కల్యాణ్ తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలం పూజ్యనీయమైనదని కాలుష్యం కాకుండా కాపాడుకోవాలని సూచించారు. ఘన, ద్రవ వనరుల నిర్వహణను సమర్థంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

--------------------------

అనంతపురంలో అనువైన భూమి చూపితే విమానాశ్రయం ఏర్పాటుపై అధ్యయనం ప్రారంభిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతుల కోసం ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటుచేయాలని రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి ఇటీవల చేసిన విజ్ఞప్తిపై ఆయన స్పందించారు. విమానాశ్రయానికి

కావాల్సిన భూమి చూపితే తదుపరి కార్యాచరణ చేపడతామని.. ఇందుకు 12 వందల ఎకరాలు అవసరమవుతాయని పేర్కొన్నారు.

-------------------------

ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడంలో లోకో పైలెట్‌లు, అసిస్టెంట్ లోకోపైలెట్‌లు, ట్రైన్ మేనేజర్‌ల పాత్ర కీలకమని, వారికి మౌలిక సదుపాయాలు, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర ఆనంద్‌రావు పాటిల్ తెలిపారు. విజయవాడలోని రన్నింగ్ రూమ్‌లో లోకో పైలట్లకు అందిస్తున్న సౌకర్యాలపై డీఆర్ఎం మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద రన్నింగ్ రూమ్‌లలో ఒకటైన విజయవాడలో మూడు జోన్‌లలోని 6 డివిజన్‌లకు సంబంధించి 14 డిపోల నుంచి అధిక సంఖ్యలో సిబ్బంది ఉంటారన్నారు. వారికి అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనం కోసం పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని సబ్సిడీ ధరలతో అందిస్తామని తెలిపారు. వీటితో పాటు వారి మానసిక ప్రశాంతత కోసం రీడింగ్ రూమ్, మెడిటేషన్ రూమ్, ఫుట్ మసాజ్ ఏర్పాట్లు ఉంటాయన్నారు.

-------------------------

సైన్యంలో పనిచేసిన మాజీ అగ్నివీర్‌లకు కేంద్ర పారమిలిటరీ బలగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్‌లు సంయుక్తంగా ప్రకటించాయి. భవిష్యత్తులో చేపట్టే కానిస్టేబుల్ నియామకాల్లో 10 శాతం మాజీ అగ్నివీరులకు రిజర్వ్ చేస్తున్నట్టు పేర్కొన్నాయి. కేంద్ర హోంశాఖ గతంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ నియామకాలు చేపట్టనున్నామని సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నైనా సింగ్, బీఎస్ఎఫ్ అధిపతి నితిన్ అగర్వాల్, సీఆర్‌పీఎఫ్ దళపతి అనీశ్ దయాల్‌లు తెలిపారు. త్రివిధ దళాల్లో నియామకాలకు సంబంధించి 2022 సంవత్సరం జూన్ నెలలో అగ్నిపథ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది.

-------------------------

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని నాలుగు రైళ్ళ ప్రయాణ సమయాలు, వేళలలో అక్టోబరు 18వ తేదీ నుంచి మార్పులు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. సికింద్రాబాద్-గూడూరు మధ్య నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ నుంచి రాత్రి 11 గంటల 5 నిమిషాలకు బయలుదేరుతుండగా సవరించిన ప్రయాణ వేళల ప్రకారం రాత్రి 10 గంటల 5 నిమిషాలకు బయలుదేరనుంది. సికింద్రాబాద్-తిరుపతి పద్మావతి ఎక్స్‌ప్రెస్ గూడూరుకు తెల్లవారుజామున 4 గంటల 43 నిమిషాలకు బదులు 4 గంటల 19 నిమిషాలకు చేరుకుంటుంది. తిరుపతి స్టేషన్‌కు ఉదయం 7 గంటల 15 నిమిషాలకు బదులు 6 గంటల 55 నిమిషాలకు చేరుకుంటుంది. లింగంపల్లి-తిరుపతి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ సాయంకాలం 6 గంటల 25 నిమిషాలకు బదులు 5 గంటల 30 నిమిషాలకు బయల్దేరనుంది. నర్సాపురం నుంచి మహారాష్ట్రలోని నాగర్‌సోల్‌కి వెళ్లే నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం ఉదయం 11 గంటల 15 నిమిషాలకు బయలుదేరుతుండగా.. అక్టోబర్ 18వ తేదీ నుంచి రాత్రి 9 గంటల 50 నిమిషాలకు బయల్దేరుతుంది.

-------------------------

పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం స్నేహపూర్వక చేయూత అందిస్తోందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి హామీ ఇచ్చారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి పారిశ్రామిక, పర్యావరణ, కార్మిక భద్రతలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తల సమస్యలను పరిష్కరించే దిశగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. పార్లమెంట్

సభ్యులు పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పలువురు పారిశ్రామికవేత్తలు వస్తున్నారని తెలిపారు. జిల్లాలో స్థాపించే పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగావకా శాలు కల్పించాలని సూచించారు. కొల్లేరు అభయారణ్యం పరిదిని ఐదో కాంటూరు నుంచి మూడో కాంటూరుకు తగ్గించాల్సిం దిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

---------------------------

అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. గుంటూరు జిల్లా వెలగపూడి సచివాలయంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ఉద్యోగాల నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై మంత్రి అధికారులతో చర్చించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై సాధ్యసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. అధికారులు బాధ్యతతో వ్యవహరించి ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలని.. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు ఏ స్థాయిలో ఉందో తెలుసుకునేలా, వారికి సమాచారం అందేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

కాకినాడ పోర్టు పరిసర ప్రాంతాల్లోని బియ్యం గోదాముల్లో గత నెల 28వ తేదీ నుంచి 10 రోజులపాటు చేపట్టిన తనిఖీల్లో 12 కేసులు నమోదుచేశారు. రెవెన్యూ, పౌర సరఫరాలు, తూనికలు, కొలతలు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు 29 గోదాముల్లో తనిఖీలు నిర్వహించి 43 వేల 642 టన్నుల బియ్యం, నూకలు, ఉప్పుడు బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 12 వేల టన్నుల రేషన్ బియ్యం ఉన్నాయని నిర్ధారించారు. 12 గోదాముల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి వాటి యాజమాన్యాలపై కేసులు నమోదు చేశారు. వీటిలో 7 కేసులపై కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ విచారణ చేపట్టారు.

---------------------------

భారతదేశ జనాభా 2060 నాటికి 170 కోట్లకు చేరుతుందని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. తర్వాత 12 శాతం తగ్గుదల రేటుతో క్రమంగా తగ్గుతుందని తెలిపింది. అయితే, ఈ శతాబ్దం మొత్తం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ కొనసాగుతుందని పేర్కొంది. ఈ మేరకు ప్రపంచ జనాభా పోకడలు–2024 పేరిట ఓ నివేదిక విడుదల చేసింది. వచ్చే 50–60 ఏళ్లలో ప్రపంచ జనాభా వెయ్యీ 30 కోట్ల వద్ద గరిష్ఠానికి చేరుతుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఆ తర్వాత కొద్దిగా తగ్గుతూ ఈ శతాబ్దం చివరకు వెయ్యీ 20 కోట్లకు తగ్గుతుందని తెలిపింది. అత్యధిక జనాభా కలిగిన దేశంగా గత ఏడాది చైనాను అధిగమించిన భారత్ 2100 సంవత్సరం వరకు అదే స్థానంలో ఉంటుందని ఐక్యరాజ్యసమితి పేర్కొంది.

---------------------------

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం 50 శాతానికి పైగా పెరగడంపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఖరీఫ్ పంటల పరిస్థితిపై అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించడానికి తాము అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఈ దిశగా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పప్పు ధాన్యాల్లో ముఖ్యంగా కందుల సాగు విస్తీర్ణంలో భారీ పెరుగుదల నమోదైందని పేర్కొన్నారు. వ్యవసాయ మంత్రిత్వశాఖ గణాంకాల ప్రకారం.. గడచిన వారాంతానికి పప్పుధాన్యాల సాగు 50 శాతం అంటే 36 లక్షల 81 వేల హెక్టార్లకు పెరిగింది.

---------------------------

ప్రభుత్వ పథకాలను ప్రజలకు సకాలంలో చేరువచేయాలని నిర్ణయించామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాజమహేంద్రవరంలోని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆరు నియోజకవర్గాల శాసనసభ్యులు, జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి, రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ... ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అతి తక్కువ సమయంలోనే అమలు చేస్తున్నామని తెలిపారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాగితపు సంచుల దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. ప్లాస్టిక్ సంచులు ఉపయోగించడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరం జులై 12వ తేదీన పేపర్ బ్యాగ్ డే గా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కాగితపు సంచుల వినియోగాన్ని పెంచే దిశగా పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు ఫీజులను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కన్వీనర్ కోటాలో ప్రభుత్వం కల్పించే ప్రవేశాలకు ఈ ఫీజులు వర్తిసాయి. మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో బీటెక్, ఎంటెక్ కోర్సులకు లక్షా 3 వేల రూపాయలు.. బీబీఏ, బీసీఏ, బీఎస్సీ కోర్సులకు 44 వేల 500 రూపాయల ఫీజును ప్రభుత్వం ఖరారుచేసింది. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో బీటెక్‌కు 60వేలు, ఎంటెక్‌కు 99 వేల 500, బీసీఏకు 37 వేలు, బీఎస్సీకి 35 వేల 500 రూపాయల ఫీజు నిర్ధారించింది. ఎస్ఆర్ఎం వర్సిటీలో బీటెక్, ఎంటెక్, ఎంబీఏలకు లక్షా 2 వేల రూపాయలు.. బీఎస్సీ, బీకాం, బీఏ, ఎమ్మెస్సీ కోర్సులకు 44 వేల రూపాయల చొప్పున నిర్ణయించింది.

=====================